సాగుకు సమాయత్తం

- ముమ్మరంగా దుక్కులు
- నారుమడులను సిద్ధం చేస్తున్న రైతులు



విశ్వనాథపల్లిలో దుక్కి దున్నుతున్న దృశ్యం

అవనిగడ్డ: దివిసీమలో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 1.03 లక్షల ఎకరాలు వరిసాగు భూములున్నాయి. దివిసీమలో ఎక్కువగా బీపీటీ 5204, ఎంటీయూ 1061, 1318, 1224 వరిరకాలు సాగు చేస్తుంటారు.

సాగునీరు ఆలస్యం..

గత ఐదేళ్లలో ఏటా జూన్ నెల పదో తేదీ నుంచి 18వ తేదీ మధ్య పంటకాలువలకు సాగునీందరించేవారు. ఎన్నికలు జరగడం, నూతన ప్రభుత్వం కొలువు తీరడంతో ఈ ఏడాది సాగునీటి విడుదల ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో బోర్లు ఉన్న పంట పొలాల్లో నారుమళ్లు పోసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంటకాలువలపై ఆధారపడి సాగు చేసుకునే రైతులకు పొలాలను దున్నించుకోవడం, ఎత్తు, పల్లాలు సరిచేసుకోవడం, గట్లు పెట్టుకోవడం, పంటబోదులు తవ్వుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల పొలాల్లో పెరిగిన కలుపు మొక్కలను రొటోవేటర్‌తో తొక్కిస్తున్నారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో ముందుగా వరిసాగు చేస్తుంటారు. నాగాయలంక, కోడూరు మండలాల్లో సాగు ఆలస్యంగా జరుగుతుంది. ఈ మండలాల్లో ఈ ఏడాది మరికొన్ని రోజులు సాగు ఆలస్యం అయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పూర్తి..

అవనిగడ్డ నియోజకవర్గంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పూర్తయింది. ఆరు మండలాల్లో జీలుగ 260 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై అందించగా, పిల్లిపెసర 285, జనుములు 145 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందజేశారు.

ఇంకా రాని వరి విత్తనాలు..

వ్యవసాయశాఖ సబ్సిడీపై పంపిణీ చేసే వరి విత్తనాలు ఇంకా రాలేదు. ఎంటీయూ 1061, 1318 రకం విత్తనాలు 565 క్వింటాళ్ల విత్తనాలు, బీపీటీ రకం 645 క్వింటాళ్ల విత్తనాలు కావాలని అధికారులు ఆర్డర్ పెట్టారు. ఇవి వచ్చిన వెంటనే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏడీఏ జయప్రద తెలిపారు. పంటకాలువకు సాగునీటి విడుదల ఆలస్యం అయ్యే అవకాశాలున్న నేపథ్యంలో వర్షాలు అయినా పడితే బాగుండని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.



చల్లపల్లి మండలంలో దంపుమడి పోస్తున్న కూలీలు



రొటోవేటర్‌తో పొలం చదును చేస్తున్న దృశ్యం

అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలింపు

వర్షాలకు బురదగా మారిన రోడ్డు



బురదమయంగా మారిన ఘంటసాల - మల్లాయి చిట్టూరు ప్రధాన రహదారి

ఘంటసాల: ఘంటసాల - మల్లాయి చిట్టూరు రోడ్డులో అర్ధరాత్రి మట్టి తరలించిన మాఫియా రోడ్డును పరిశుభ్రం చేయకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. దీంతో పలువురు ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా అర్ధరాత్రులు ట్రాక్టర్ల సాయంతో మట్టి అమ్ముకున్నారని ఆరోపిస్తున్నారు. ఘంటసాల నుంచి మల్లాయి చిట్టూరు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే మట్టి తవ్వకాలు చేయడంతో దారి కుంగిపోయే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. మట్టి తరలించిన సంబంధిత వ్యక్తులు ప్రధాన రహదారిపై పడిన మట్టి తొలగించకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. ఆ మార్గంలో సోమవారం ప్రయాణించిన పలువురు ద్విచక్ర వాహనదారులు బురదలో అదుపుతప్పి పడిపోయారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాగాయలంక: మండలంలోని నాగాయలంక, ఏటిమొగ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ శాఖ ఏఈ జి.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిగువున గుల్లలమోద, ఏటిమొగ, పెదకమ్మవారిపాలెం, ఎదురుమొండి, నాచుగుంట, జింకపాలెం తదితర గ్రామాలు, నాగాయలంక, పరిసరగ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, తీగలపై పడుతున్న చెట్లు కొట్టడం లాంటి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామాలయంలో వార్షికోత్సవ పూజలు



గూడూరు: మండలంలోని జక్కంచర్లలోని రామాలయం వార్షికోత్సవ పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు పెడన ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, మాజీ డీసీ చైర్మన్ పోతన స్వామి, గోపి నాగబాబు, అన్నం హరిరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన షట్టర్లను పునర్నిర్మించాలి



మోపిదేవివార్పు(మోపిదేవి): మండలంలోని మోపిదేవి వార్పు వద్ద 1936లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్మించిన అక్విడెక్ట్‌కు ఏర్పాటు చేసిన షెట్టర్స్ శిథిలమయ్యాయి. వీటిస్థానంలో కొత్తవాటిని నిర్మించాలని దిగువ ప్రాంతవాసులు కోరుతున్నారు. అక్విడెక్టు దిగువ ప్రాంతంలో సాగు, తాగు నీరు సమృద్ధిగా అందించాలని రైతులు కోరుతున్నారు. విజయవాడ కేఈబీ కెనాల్ నుంచి ఖరీఫ్ సాగుకు త్వరలోనే ప్రభుత్వం నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున ముందస్తుగా షట్టర్స్‌కు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

జూన్‌లో వికసించిన మే పుష్పం



ఘంటసాల: ఘంటసాల గ్రామానికి చెందిన పిసుపాటి సోదరుల గృహాల్లో మే పుష్పాలు జూన్‌లో వికసించాయి. ఘంటసాల గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పిసుపాటి సుబ్బయ్య శర్మ పెరట్లో, పిసుపాటి వెంకట నరసింహారావు పెరట్లో మే పుష్పాలు జూన్ నెలలో పూసి పలువురిని ఆకట్టుకుంటున్నాయి. మే నెలలోనే వికసించే ఈ పుష్పాలు ఆలస్యంగా జూన్ నెలలో పుష్పించాయి.

వాసవీ క్లబ్ చేయూత



మచిలీపట్నంటౌన్: వాసవీక్లబ్, వనిత క్లబ్, కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆరు స్టీల్ స్టూల్స్ అందజేశారు. రుస్తుంబాద శివాలయానికి ఒకటి, సుబ్రహ్మణ్యం చెరువువద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఒకటి, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకులను అందజేశారు. రాజుపేట లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు, అట్టలు అందజేశారు. ట్రాఫిక్ పోలీసులకు ఫ్లోరోసెంట్ జాకెట్లు, మాస్కులు అందజేశారు. వీధి వ్యాపారులకు 15 గొడు గులను అందించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు వేముల నరసింహకృష్ణమూర్తి, కార్య దర్శి జల్లూరి రాంబాబు, కోశాధికారి జయవరపు ప్రసాద్, వనిత క్లబ్ అధ్యక్షురాలు తమ్మన అనూరాధ, కార్యదర్శి శ్రీదేవి, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు ఉడత్తు శ్రీనివాసరావు, కార్యదర్శి మధుసూదనరావు, కోశాధికారి తమ్మన ప్రసాద్, రీజనల్ చైర్‌పర్సన్ శ్రీకాకోళపు రేణుకారాణి, ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పుల్లూరి ప్రకాష్, ఇంటర్నేషనల్ ప్రో గ్రాం కో ఆర్డినేటర్ యెండూరి సురేష్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



బంటుమిల్లి ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం టౌన్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వ దినాన్ని నగరంలోని ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్తాఖాన్‌పేటలో ఉన్న ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం మత గురువులు బక్రీద్ పర్వ దినం విశిష్టతను ముస్లింలకు వివరించారు. బక్రీద్ రోజున ముస్లింలు పేదలకు మాంసాన్ని దానం చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ తర్వాత మరో ప్రధానమైన పండుగ బక్రీద్ అన్నారు. సమైక్యతను, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను నూతన ప్రభుత్వంలో ధైర్యంగా, స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం సమాజానికి కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రార్థనల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, నగర నాయకుడు గద్దం రాజు, టీడీపీ మైనారిటీ విభాగం నాయకులు ఇలియాస్‌పాషా, సయ్యద్‌ఖాజా, బాజానీ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని స్థానిక కృష్ణానది తీరంలోని జుమా మసీదులో ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్ అబ్దుల్ సత్తార్ నేతృత్వంలో మహ్మద్ ప్రవక్త సందేశాలను వినిపించారు. ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం చిన్నారులు అల్లాహ్ ప్రార్థనలు చేశారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ జానీ తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



అవనిగడ్డలో బక్రీద్ ప్రార్థనలో ముస్లింలు



ఘంటసాల చిన్నమసీదులో జరిగిన బక్రీద్ వేడుకల్లో ముస్లింలు

బంటుమిల్లి: స్థానిక ఈద్గా మైదానంలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువు ముజఫర్ హుస్సేన్ బక్రీద్ పండుగ విశేషాలను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండి.కమాల్ బాషా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: బక్రీద్ పర్వదినాన్ని గూడూరు మండలంలో ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్ వేడుకలలో భాగంగా మండలంలోని మసీదుల్లో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గూడూరులోని జామియా మసీదులో నిర్వహించిన ప్రార్థనల్లో మతగురువు హాఫిజ్ షోయబ్ ఖుత్బా ప్రసంగం చేశారు. త్యాగనిరతికి, అల్లాపై విశ్వాసానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ సందేశాన్ని ఆయన ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మండలంలలోని తరకటూరు, ఆకులమన్నాడు, మల్లవోలు, పోలవరం, పినగూడూరులంక, షా అబ్దుల్లా పాలెం, పటాన్‌పేట మసీదుల్లో ప్రత్యేక ఈద్ నమాజులు ఆచరించారు.



ఈద్గా వద్ద ప్రార్థనలు



నాగాయలంక జుమామసీదులో..

కోడూరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దివిసీమలో ముస్లిం గ్రామంగా చెప్పబడే చినగుడుమోటులో ప్రతి ఇంటి వద్ద పండుగ శోభ ఉట్టిపడింది. పెదగుడుమోటు, కోడూరు, నరసింహపురం మసీదుల్లో ముస్లింలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ విశిష్టతను ఇమాంలు వివరించారు. ఇతర గ్రామాల్లో స్థిరపడిన ముస్లింలు స్వగ్రామాలకు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ఘంటసాల: స్థానిక చిన్న మసీదులో బక్రీదు పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు ఇమామ్ మహ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత జరిగిన సమావేశంలో ఇమామ్ మాట్లాడుతూ ఈ పండుగ మానవుడు జీవితంలో ఎలా నడుచుకోవాలో నేర్పిస్తుందన్నారు. అనంతరం ముస్లిలు ఒకరికి ఒకరు బక్రీదు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సంస్థ కృష్ణాజిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీమ్, షేక్ జాకీర్ హుస్సేన్, షేక్ అనీస్, షేక్ ఖలీపా, షేక్ జాఫర్, తదితరులు పాల్గొన్నారు. గోటకం, లంకపల్లి గ్రామాల్లోని మసీదుల్లో బక్రీద్ వేడుకలను నిర్వహించారు.

అవనిగడ్డ: స్థానిక జామియా మసీదు ఆవరణలో బక్రీద్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని ఆధ్యాత్మిక గురువులు పేర్కొన్నారు. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

కనుల పండువగా జగజ్జ్యోతి

- ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం హరికథ
- రెండో రోజు రంగనాయక, రామలింగేశ్వరుని ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని ప్రధాన రహదారి రాబర్ట్‌సన్‌పేటలో పక్క పక్కనే ఉన్న వేంచేసి ఉన్న శ్రీ దేవీ, భూదేవి సమేత శ్రీ రంగనాయక స్వామి, శ్రీ పర్వతవర్ధినీ, శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వార్ల వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో రాత్రి నిర్వహించిన జగజ్జ్యోతి కార్యక్రమం కనుల పండువగా జరిగింది. బీరం త్రినాథ్, మహాలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజపట ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. తాడేపల్లి నాంచారయ్య దంపతులు అంకురారోహణ, కొప్పర్తి నరసింహమూర్తి దంపతులు నిత్య బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి భాగవతారిణి పి.లక్ష్మీలీల చెప్పిన పార్వతీ కల్యాణం హరికథ భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



యూవీఆర్ పాఠశాలను ట్రస్టు ప్రతినిధులతో ప్రారంభిస్తున్న ధమ్మదజ బంతిజే

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో గొర్రెపాటి విద్యాట్రస్టు ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్మించిన ఉదయ భాస్కరమ్మ- వెంకట్రాయులు గొర్రెపాటి ప్రాథమికోన్నత పాఠశాలను అమెరికా నుంచి రంగనాథ బాబు ఆన్‌లైన్ ద్వారా, బౌద్ధ భిక్షువు దమ్మ దజ బంతిజే స్థానికంగా రిబ్బన్ కత్తిరించి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగనాథ బాబు మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలనుకున్నట్లు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో నామమాత్రపు ఫీజులతో కార్పొరేట్ స్థాయిలో ఉదయ భాస్కరమ్మ-వెంకట్రాయులు గొర్రెపాటి పాఠశాలను ప్రారంభించామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు క్రమశిక్షణతో కూడిన ఉన్నత విద్యను ఈ పాఠశాల ద్వారా అందిస్తామన్నారు. గ్రామ విద్యార్థులకు మంచి విద్య అందించాలనే కాంక్షతో తల్లిదండ్రులైన ఉదయభాస్కరమ్మ - వెంకట్రాయులు పేరు మీద పాఠశాలను నిర్మించి ప్రారంభించామన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యయప్రయాసలకు ఓర్చి ఉన్నతంగా నిర్మించిన ఈ పాఠశాలను ఘంటసాల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా బౌద్ధ భిక్షువు దమ్మ దజ బంతిజే గౌతమ బుద్ధుని చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను ప్రారంభించారు. యూవీఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోయ నాగేశ్వరరావు, చల్లపల్లి విజయ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, ఆర్కిటెక్ శ్రీధర్, ఏవో డి.జవహర్, డి.జవహర్, ఇంజినీర్ ఎస్.వరదారావు, గొర్రెపాటి ట్రస్టు ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు సమస్య లేకుండా చర్యలు

డ్రెయినేజీ డీఈ వెంకటేశ్వరరావు



కోడూరులో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న డీఈ, నేతలు

కోడూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలు ముంపు బారిన పడకుండా డ్రెయినేజీలు ప్రక్షాళన చేసి ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు ఆ శాఖ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కోడూరులోని పలు మురుగు డ్రెయిన్లను స్థానిక టీడీపీ, జనసేన నేతలతో కలిసి డీఈ పరిశీలించారు. డ్రెయినేజీల్లో పెరుకుపోయిన చెత్తాచెదారం, సిల్ట్‌ను తొలగించనున్నట్లు డీఈ చెప్పారు. అధిక వర్షాలు పడినా కూడా పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సీజన్ ప్రారంభం కాకముందే పనులు చేస్తామని డీఈ చెప్పారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మర్రే గంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సురేష్, టౌన్ అధ్యక్షుడు కోట రాంబాబు, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాలన అందిస్తాం



బంటుమిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపుదల తదితర ఐదు అంశాలపై సంతకాలు చేశారని కాగిత పేర్కొన్నారు. పెంచిన పింఛన్లు ఏప్రిల్ నుంచి కలిపి జూలైలో అందజేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని చెప్పడానికి ఇదే నిదర్శనమని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కాగిత అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, మాజీ అధ్యక్షుడు యిల్లూరి లీలకృష్ణ, చోరంపూడి, మల్లంపూడి సర్పంచ్‌లు రేవు గోపాలకృష్ణ, రేవు శ్రీనివాసరావు, బొర్రా కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు క్షీరాభిషేకం

కోడూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నేతలు సోమవారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. కోడూరు ఎస్టీ కాలనీలో పార్టీ నేతల బొడ్డు వెంకన్న పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ఐదు హామీలపై చంద్రబాబు సంతకాలు చేశారని నేతలు కొనియాడారు. పార్టీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావుతో పాటు మండల, గ్రామ నేతలు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

పెడన: మండల పరిధిలోని కొంకేపూడి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదును ప్రత్యేక వాహనంపై గ్రామంలో ఊరేగింపు ర్యాలీ చేశారు. ఇందులో భాగంగా మహిళలు కాగితకు పూలు చల్లి హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో భాగంగా ఎమ్మెల్యే కాగిత స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి గెలుపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ మిల్క్ యూనియన్ జిల్లా సభ్యుడు అర్జా నగేష్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు గుడిశేవ రామారావు, సీనియర్ నాయకుడు శలపాటి ప్రసాదు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



కృత్తివెన్ను: మండల పరిధిలోని సీతనపల్లి స్లోపు వద్ద గల అయ్యప్పస్వామివారి దేవస్థానం 26వ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ కె.నాగబాబు తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు విశేషమైన అభిషేకములు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఆలయం వద్ద స్వామివారి అఖండ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

గోవధపై కేసు నమోదు



పెడన: పట్టణ పరిధిలోని 6వ వార్డులో సోమవారం బక్రీదు పండుగ సందర్భంగా గోవులను వధిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ సమాచారం మేరకు కొంత మంది వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను చట్ట విరుద్ధంగా చంపుతున్నట్లు మచిలీపట్నంకు చెందిన గోవధ వ్యతిరేక సంఘ సభ్యుడు జన్ను వెంకటగణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సమాచారం అందుకున్న సంఘ సభ్యులు సంఘటన స్థలం వద్దకు వెళ్లే సరికి అక్కడ 8 ఆవులు ఉన్నాయి. వాటిలో ఒకదానిని చంపగా మిగిలిన ఆవులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు. చంపిన గోవుకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.